
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 1 నవంబరు 2025



పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

శ్రీకాకుళం రిమ్స్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల, రిమ్స్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను నవంబరు 4వరకు హెచ్‌టీటీపీ://శ్రీకాకుళం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. దీనిపై ఎలాంటి అభ్యంతరాలున్నా నవంబరు 4వ తేదీలోగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాల కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించాలి. వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితా ప్రకటిస్తామ'ని అప్పలనాయుడు తెలిపారు.



అరసవల్లిలో కూల్చివేతలతో వెలవెలబోతున్న ఆదిత్యుడి ఆలయ పరిసరాలు

కూల్చివేతలు సరే..
పనులేవీ?

- అరసవల్లిలో ఎక్కడి సమస్యలు అక్కడే
- వెలవెలబోతున్న ఆలయ పరిసరాలు
- ఆలయ సిబ్బందికి జీతాలు చెల్లించని వైనం

అరసవల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి)

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ఏడాది ఫిబ్రవరిలో రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించి, ఉత్సవాలను మూడు రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ పథకం కింద వచ్చే రథసప్తమి నాటికి రూ.100కోట్లతో దేశంలోనే గొప్ప పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు గొప్పలు చెప్పారు. పనుల పేరిట ఆలయ పరిసరాల్లోని షెడ్లు, ప్రసాదాల విక్రయాల కేంద్రాలు, ఉచిత అన్నదాన సత్రం భవనాలను కూల్చేశారు. వీటితో పాటు ఆదిత్యుడి ఆలయానికి ఆదాయం సమకూర్చే షాపులు కూడా కనుమరుగయ్యాయి. ఇది జరిగి 8 నెలలు కావస్తున్నా ఆలయ అభివృద్ధి కోసం ఒక్క ఇటుక కూడా వేసిన పాపాన పోలేదు. కూల్చివేతల అనంతరం నాయకులు, అధికారులు ఇటువైపు చూసిన దాఖలాలు లేవు. ఆలయ పరిసరాల్లో నీడ సౌకర్యం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎంతో వైభవంగా కనిపించిన ఆలయ పరిసరాలు నేడు వెలవెలబోతుండడంతో వారు ఆవేదన చెందుతున్నారు. అలాగే ఆలయానికి సంబంధించిన అన్ని పనులు, వ్యవహారాల్లో అరసవల్లికి చెందిన స్థానిక అధికార పార్టీ నాయకులు కొంతమంది (మిగతా 6వ పేజీలో..)

మంత్రి ఆదేశాలతోనైనా కదిలేనా?

ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు అరసవల్లిలో పర్యటించి ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. కచ్చితమైన ప్లాన్ తయారు చేయాలని, అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ, విక్రయ కేంద్రాలు, రాజగోపురం చెడిపోకుండా ఆలయ అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఇంద్రపుష్కరిణితోపాటు భక్తుల కోసం వెయిటింగ్ హాల్ నిర్మాణం, వసతి ఏర్పాట్లు, షాపింగ్ కాంప్లెక్స్, కొత్త క్యూలైన్ల ఏర్పాటు వంటి పనులు రానున్న రథసప్తమి నాటికే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సుమారు రూ.12 కోట్ల ఆలయ, సీజీఎఫ్ నిధులతో ఈ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే, వచ్చే ఏడాది జనవరి 25న రథసప్తమి ఉత్సవాలు జరగనున్నాయి. ఈలోపైనా పనులు ప్రారంభమవుతాయో? లేదో చూడాలి.

రేపు ఆదిత్యుడి తెప్పోత్సవం..

అరసవల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని అరసవల్లిలో ఆదిత్యుడి హంస నావికోత్సవం (తెప్పోత్సవం) ఆదివారం నిర్వహించనున్నారు. ఉషా ఛాయా పద్మినీ సమేత దేవేరులతో స్వామిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. సాయంత్రం 4.15 గంటలకు ఇంద్ర పుష్కరిణిలో హంసవాహనంపై ఊరేగిస్తారు. అనంతరం గ్రామ తిరువీధి మహోత్సవం, ఆలయ అనివెట్టి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ఇంద్రపుష్కరిణి వద్ద వైజయంతి కళా ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా చెక్క భజన, భరతనాట్యం, కోలాట నృత్యం ప్రదర్శిస్తారు. అలాగే శనివారం కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామి స్వర్ణాభరణాలతో అలంకరించనున్నామని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు.

అమరవీరుల కుటుంబాలకు
అండగా ఉంటాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- సమాజ భద్రతలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం: ఎస్పీ
- ముగిసిన పోలీసు అమరవీరుల వారోత్సవాలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రాష్ట్రీయ ఏక్తాదివస్, అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డే అండ్‌నైట్ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో అమరవీరుల స్మారకార్థం కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 'అమరవీరుల త్యాగాలు మన దేశ ఐక్యమత్యం, సమగ్రతకు పునాది. వారి స్ఫూర్తి మనందరికీ ప్రేరణగా నిలుస్తుంది. యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాల'ని పిలుపునిచ్చారు.

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చూపిన ఐక్యతా మార్గం, అమరవీరుల త్యాగాలు మనందరినీ దేశభక్తి వైపు నడిపిస్తున్నాయి. సమాజ భద్రత, దేశ ఐకమత్యం కాపాడడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం. పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి సామాజిక ఐక్యతకు కట్టుబడి ఉంటుంద'ని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల స్ఫూర్తి ప్రతి ఒక్కరికి దేశభక్తి, కర్తవ్య నిబద్ధతను నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద, శేషాద్రీ, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారిగా కింజరాపు ప్రభాకర్

శ్రీకాకుళం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారిగా కింజరాపు ప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఉన్న రీజనల్ అధికారి బర్ల ప్రసాద్ పదవీ విరమణ చెందారు. ఆయన స్థానంలో విశాఖపట్నం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కింజరాపు ప్రభాకర్‌కు.. శ్రీకాకుళం రీజనల్ బాధ్యతలు కూడా అప్పగిస్తూ విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శ్రీకాకుళం కార్యాలయంలో ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు.

2,744 ఎకరాల్లో నష్టం

- అధికారుల ప్రాథమిక అంచనా
- ఇంకా ముంపులోనే వరిపంట
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

టెక్కలి రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వరిపంట కోతకు వచ్చేదశలో మొంథా తుఫాన్.. రైతుల ఆశలను ముంచేసింది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో జిల్లాలో వేలాది ఎకరాల వరి పంట నీటమునిగింది. వర్షం తెరిపినివ్వడంతో పంట నష్టం అంచనాల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రాథమికంగా 2,744 ఎకరాల్లో 7,197 మందికి రైతులకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి.. పూర్తిస్థాయిలో నష్టంపై నివేదికలు సిద్ధం చేస్తున్నారు. బాధితులు మరింత పెరగనున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.8లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. దీని ద్వారా 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కాగా మొంథా తుఫాన్ ప్రభావంతో సుమారు 30 శాతం పంటలకు నష్టం (మిగతా 6వ పేజీలో..)



- టెక్కలి మండలం జగన్నాథపురానికి చెందిన **కలిశెట్టి చిన్నారావు** అనే కౌలు రైతు ఏడు ఎకరాల్లో వరి పండిస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా సుమారు నాలుగు ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పటికీ పంట నీటిలోనే ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు సుమారు రూ.40వేలు చొప్పున పెట్టుబడి పెట్టామని, చేసిన అప్పు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- టెక్కలి మండలం కొల్లివలసకు **వజ్జల ధర్మారావు** అనే కౌలు రైతు సుమారు 5 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. మొత్తం పంటంతా నీట మునగడంతో లబోదిబోమంటున్నారు.



- మెళియాపుట్టి మండలం జలగలింగుపురానికి చెందిన నడిమింటి సోమేశ్వరావు 20 ఎకరాల వరకు భూమిని కౌలుకి తీసుకుని వరి పండిస్తున్నారు. ఎకరాకు పది బస్తాల వరకు ఇస్తామని భూమిహక్కుదారులైన రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకున్నారు. కాగా.. ప్రస్తుత తుఫాన్ కారణంగా పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆందోళన చెందుతున్నారు. నీరు లేకుండా బట్టీలు వేస్తూ.. పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బుడుమూరులో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు దగ్ధం
- రూ.8 లక్షల ఆస్తి నష్టం

8లో

దొంగతనం కేసులో
ఇద్దరి అరెస్టు

విద్యార్థిని మృతిపై
ముమ్మర దర్యాప్తు

8లో

ఇందిరాగాంధీకి ఘన నివాళి

7లో



ఐక్యతా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, తదితరులు

సర్దార్ సేవలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా ఐక్యతా ర్యాలీ
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

6లో



ఆన్‌లైన్‌లో పాఠశాలల సమాచారం

- యూడైస్ ప్లస్‌లో.. ఒకే క్లిక్‌తో సమగ్రమూ..
- దీని నివేదిక ఆధారంగానే కేంద్రం నిధులు

6లో

కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

- ఆందోళనలో చాపర గ్రామస్థులు
- ఇటీవల ఇద్దరు వ్యక్తుల మృతి
- కలుషితనీరే కారణమని ఆరోపణలు



- మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన **రంది రమేష్** కొన్నేళ్లుగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ.. ఈ నెల 20న మృతి చెందాడు. ఆయన మృతితో తమకు పెద్ద దిక్కులేకుండా పోయిందని కుటుంబ సభ్యులు విచారం వ్యక్తం చేస్తున్నారు.
- ఇదే గ్రామానికి చెందిన అడ్డాపు రామారావు కూడా కిడ్నీవ్యాధితో బాధపడుతూ గత నెలలో ప్రాణాలు కోల్పోయాడు. డయాలసిస్ చేయించినా, మందులు వాడినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు విలపించారు.



చాపరలో శిథిలావస్థకు చేరుకుని నాచుపట్టిన రక్షితనీటి పథకం



చాపర గ్రామం

మెళియాపుట్టి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి)

..ఇలా చాపర గ్రామాన్ని కిడ్నీవ్యాధి కబళిస్తోంది. గ్రామంలో సుమారు 5వేల మంది జనాభా ఉన్నారు. ఇటీవల కిడ్నీవ్యాధి బారిన పడి ఇద్దరు మృతి చెందారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన బి.మధు, వి.దాసునాయుడు, ఆర్.తేజ, నారాయణమూర్తి తదితరులు కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారు. డయాలసిస్ సేవలు పొందుతున్నారు. పేద కుటుంబాలు కావడంతో వైద్యం చేయించు కోవడానికి కొంతమంది బాధితులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ అందజేస్తున్నా వైద్యఖర్చులకు చాలడం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులు కొంతమంది చందాలు వేసుకుని బాధితులకు అండగా నిలుస్తున్నారు. గ్రామంలో కొన్నాళ్ల నుంచి కిడ్నీవ్యాధి తీవ్రత పెరుగుతున్నా పట్టించుకునే నాథులు లేరని మాజీ వైస్ సర్పంచ్ ఆర్.తేజేశ్వరరావు తెలిపారు.

కలుషిత నీరే కిడ్నీవ్యాప్తికి కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రక్షితనీటి పథకం పూర్తిగా పాడైపోయి.. నాచు పట్టి నీరు కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మెళియాపుట్టిలోని (మిగతా 6వ పేజీలో..)

ఆన్‌లైన్‌లో పాఠశాలల సమాచారం

- యూడైస్ ప్లస్‌లో.. ఒకే క్లిక్‌తో సమగ్రమూ..
- దీని నివేదిక ఆధారంగానే కేంద్రం నిధులు


పాఠశాలలో ఆధార్ అప్‌డేట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవోలు (ఫైల్)

నరసన్నపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి)

విద్యావ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకేచోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకుగాను యూడైస్‌ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) వెబ్‌సైట్‌ను కేంద్ర మానవ వనరులశాఖ రూపొందించింది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వపాఠశాలల పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమవుతుంది. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంతో పాటు మౌళిక వసతులు, డ్రాపౌట్స్ వంటివి స్పష్టంగా తెలుసుకునే వీలుంది. ఇప్పుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌ను అప్‌డేట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో యూడైస్ నమోదు మాన్యువల్‌గా ఉండగా 2022-23 నుంచి యూడైస్ ప్లస్‌గా ఆధునీకరించారు. అప్పటి నుంచి కేంద్రప్రభుత్వం వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని సేకరించి అప్‌డేట్ చేస్తున్నారు. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్‌డేట్ చేయగా.. ఇకపై నిరంతరం సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేసే అవకాశం ఉంది. పాఠశాలలో మౌలికవసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మాడ్యుల్స్‌గా.. వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

వివరాలు సమగ్రంగా నమోదు..

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతి విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు నమోదు చేశారు. ఇప్పుడు అప్‌డేట్ అయిన సమాచారం జతచేస్తున్నారు. అలాగే తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు తదితర సదుపాయాల వివరాలతో పాటు వాటి స్థితిగతులపై తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందుతున్న సౌకర్యాల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని అందించనున్నారు.

ప్రతీ విద్యార్థికి ఒక నెంబర్ కేటాయింపు

యూడైస్ ప్లస్ పోర్టల్ కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రతిఏటా అన్ని పాఠశాలల సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో నమోదు చేసిన ప్రతీ విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పీఈఎన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో ఏఏ తరగతులు చదివాడు? అనేది కచ్చితంగా తెలుస్తుంది. పదోతరగతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాయాలంటే ఇందులో నమోదై ఉండాల్సిందే. అలాగే ఆటోమేటిడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఆపార్) ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు మాదిరిగానే జారీ చేయాలి. జిల్లాలో 3,07,556 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుచున్నారు. వీరిలో 2,72,845మందికి ఆపార్ కార్డులు జనరేట్ కాగా, మిగతా 28వేల మందికి ఇవ్వాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల నమోదు ప్రక్రియ అప్‌డేట్ నిరంతరాయంగా జరుగుతుంది. ఈనెల యూడైస్ ప్లస్ సమాచారం ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

-ఎ.రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం

సర్దార్ సేవలు స్ఫూర్తిదాయకం


వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అరసవల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సేవలు స్ఫూర్తిదాయకమైనవని శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావులు అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సూర్యమహల్ కూడలి నుంచి అంబేద్కర్ ఆడిటోరియం వరకు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం తరువాత దేశ ఐక్యత, సమగ్రతల కోసం ఆయన చేసిన కృషి నిరుపమానమని కొనియాడారు. ఆయన కృషి, పట్టుదల, కార్యదీక్ష నేటి యువతకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్, డిజిటల్ ఇండియా లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్వహించనున్న యువజనోత్సవాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నీరజాసుబ్రహ్మణ్యం బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీఓ సాయి ప్రత్యూష, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఆయుష్ వైద్యాధికారి డా.జగదీష్, డీఎంహెచ్‌ఓ డా.అనిత, మేరా యువ భారత్ డీడీ వెంకట్ ఉజ్వల్, వివిధ కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలు సరే.. పనులేవీ?

(ఐదో పేజీ తరువాయి)

తలదూరుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏ కాంట్రాక్టయినా, టెండరైనా తమకు లేదా తమ బినామీలకే ఇవ్వాలని వారు పట్టుబడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆలయ అధికారులు చేసేదేం లేక స్తబ్దుగా ఉండిపోతున్నారు. దీనికితోడు ఆలయంలో పని చేస్తున్న 49 మంది దినసరి ఉద్యోగులకు తొమ్మిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. వీరందరినీ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకుగాను వివిధ సంస్థల నుంచి టెండర్లు కూడా నిర్వహించారు. వాటి దస్త్రాలు ఇప్పటికీ దేవదాయ శాఖ కమిషనర్ ఆఫీసులోనే మూలుగుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కల్పించుకుని, ఆలయ అధికారులు, అర్చకులు, గ్రామస్థులతో సమావేశమై ఆదిత్యాలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కిడ్నీవ్యాధి కబళిస్తోంది

(ఐదో పేజీ తరువాయి)

మహేంద్ర తనయ నదిలో బోరు ఏర్పాటు చేశారు. దానిద్వారా చాపర, సట్టపురం, శేఖరాపురం, పెద్దలక్ష్మీపురం గ్రామాలకు తాగునీరందించేందుకు ట్యాంకులు ఏర్పాటు చేసి పైపులైన్లు అమర్చారు. వైసీపీ పాలనలో వీటి నిర్వహణను పట్టించుకోలేదు. పాత బోర్లు నీరే సరఫరా చేస్తున్నారు. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కిడ్నీవ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీరు బాగోలేదు..

కొన్ని నెలల నుంచి తాగునీరు బాగోలేక గ్రామానికి చెందిన కొంతమంది కిడ్నీవ్యాధి బారిన పడుతున్నారు. ట్యాంకులు పూర్తిగా నాచు పట్టడంతో నీరు కలుషితమవుతోంది. అధికారులు, పాలకులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

-బి.మన్మథరావు, చాపర

ఆరు రోజులైనా ఇంతే..

- మరమ్మతులకు నోచుకోని పెద్దబాడాం కల్వర్టు
- 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు


తుఫాన్ దాటికి కొట్టుకుపోయిన కల్వర్టు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెద్దబాడాం వద్ద రోడ్డుపై ఉన్న కల్వర్టు వరద తాకిడికి కొట్టుకుపోయింది. ఆరురోజులు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడం 20 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాస్తవానికి గత నెలలో కురిసినా భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. తర్వాత మరమ్మతులు చేయడంతో రాకపోకలు పునరుద్ధరణ జరిగింది. అయితే మొంథా తుఫాన్ ప్రారంభంలోనే ఈ కల్వర్టు కొట్టుకు పోయింది. తరువాత తుఫాన్ విడిచి వర్షాలు తగ్గినా కల్వర్టును సంబంధిత అధికారులు మరమ్మతులు చేయలేదు. దీంతో నిత్యమూ ఈ రహదారిపై రాక పోకలు సాగించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతుల చేపట్టా లని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

2,744 ఎకరాల్లో నష్టం

(ఐదో పేజీ తరువాయి)

వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇచ్ఛాపురం, నందిగాం, నరసన్నపేట, మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు పాతపట్నం, టెక్కలి మండలాల్లో వరిపంటతో పాటు కూరగాయలు, మొక్కజొన్న, అరటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని గుర్తించారు. అలాగే అధికంగా కౌలు రైతులు కుదేలయ్యారు. జిల్లాలో 30వేల మంది వరకు కౌలు రైతులు ఉండగా.. 7,618 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఉన్నాయి. కాగా తుఫాన్ కారణంగా చాలా మంది పంటలు కోల్పోగా.. ప్రభుత్వం తరఫున పరిహారం అందు తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అప్పు చేసి పంట పండించా మని, కోత దశలో తమకు తుఫాన్ తీరని నష్టం మిగిల్చిందని వాపో తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై కృష్ణా జిల్లా పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వద్ద రైతులు మొరపెట్టుకున్నారు. దీనిపై కేబినెట్‌లో చర్చించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కౌలు రైతులకు ఆయన భరోసా ఇచ్చారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం..

మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం. ప్రాథమికంగా అంచనాలు తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి అందించాం. ప్రస్తుతం అధికారుల్లో గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనాలు రూపొందిస్తున్నారు. బాధితులందరికీ నష్ట పరిహారం అందజేస్తాం.

-కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి

పోలీసుల క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పలాస/కాశీబుగ్గ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా కాశీబుగ్గ పోలీసులు శుక్రవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. సీఐ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు మరువలేనివని, అమరులను గుర్తించుకోవడం మన విధి అన్నారు. వారం రోజుల పాటు ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, పోలీసులు కూడా ప్రజల్లో భాగమనే విషయాన్ని అంతా గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో అసువుబాసిన పోలీసు అమరవీరులకు ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. కాశీబుగ్గ సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకా నీటిలోనే..

- నాలుగు రోజులుగా తడుస్తున్న వరి
- మొలకలు వస్తున్న వైనం

మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో వరి పంట ఎక్కడికక్కడ నీట మునిగింది. నాలుగు రోజులుగా పొలాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో వరిచేలు నానుతున్నాయి. దీనివల్ల మొలకలు వచ్చి.. పంట మరింత దెబ్బ తింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంట నష్టాలను అంచనా వేసేందుకు అధికారులు, నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


వరిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


మందస-డిమిరియా రోడ్డు వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీష


సిలగాం వద్ద పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

గార, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తుపాన్ కారణంగా చేపల వేటకు వెళ్లలేకపోయిన మత్స్యకార కుటుంబాలకు బందరువానిపేట, మత్స్యలేశం తదితర గ్రామాల్లో ఉచిత బియ్యాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ఎన్నో రాయితీలను అందిస్తోందన్నారు. త్వరలో మత్స్యకారులకు నిత్యావసర సరుకులు అందిస్తామని చెప్పారు. అనంతరం సిలగాం గ్రామం వద్ద వర్షాలకు పాడైన వరి పంటను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మత్స్యకార నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకుంటాం..

హరిపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకొనేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం జిల్లుండ, డిమిరియా, వీజీపురం తదితర గ్రామాల్లో ఆమె పర్యటించి ముంపునకు గురైన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. అ నంతరం కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న డిమిరియా వంతెనను పరిశీలిం చారు. రైతులతో మాట్లాడుతూ అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు బావన దుర్యోధన, లింగ రాజు, ఎం.చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికి న్యాయం చేస్తాం..


నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న ఏడీ రాజగోపాల్

ఎల్ఎన్ పేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని కొత్తూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి.రాజగోపాల్ తెలిపారు. ముంపునకు గురైన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో పంటలు నష్టపోయిన పంటపొలాలను వ్యవసాయశాఖ సిబ్బంది, రెవెన్యూశాఖ సిబ్బందితో పరిశీలనలు చేయించి నివేదికలను తయారు చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయాధికారి కిరణ్‌వాణి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, జడ్పీటీసీ కె.త్రినాథ్ కోరుతూ ఏడీ బి.రాజగోపాల్, ఏవో కిరణ్‌వాణికి వినతి పత్రం ఇచ్చారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ, పి.విష్ణుమూర్తి, ఆర్.రామారావు తదిరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ..

జి.సిగడాం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన బారీ వర్షాలకు పెంట గ్రామానికి చెందిన యండమూరి సత్యం పూరింటి గోడ గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో ఒక్కసారిగా శబ్దం రావటంతో నిద్రలో ఉన్న కుటుంబం సభ్యులు బయటకు పరుగులు తీశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు నానడంతో మట్టిగోడ కూలిపోయింది. ఇంటిలో ఉన్న విద్యుత్ పరికరాలు, ఇతర వస్తువులు పాడయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. ఆస్తి నష్టం సుమారు రూ. 60 వేలు ఉంటుందని వీఆర్వో నర్సింగరావు తెలిపారు. ఆయన వెంట వీఆర్ఏ పి.బాలకృష్ణ, గ్రామపెద్దలు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన..

ఇచ్ఛాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ముంపునకు గురైన పంట పొలాలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

వరద నీటిలోనే..

ఆమదాలవలస, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బూర్జ మండలంలోని వివిధ గ్రామాలలో వరి పంట ఇంకా వరద నీటిలోనే ఉంది. దీంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓవీపేట, కంట్లాం, గుత్తావల్లి, కాశపర్తి, నాగావళి నది పరీవాహక గ్రామ పంచాయతీలలో వరిచేలను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.


వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు


నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

కళాశాలల్లో ఉత్సాహంగా యువజనోత్సవాలు



కంచిలి: నృత్య పోటీలలో విజేతలుగా నిలిచిన ఎంఎస్‌పల్లి విద్యార్థులు



ఇచ్ఛాపురం: జానపద నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



సోంపేట: నృత్య పోటీల విజేతలతో అధ్యాపకులు

సరుబుజ్జిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా శుక్రవారం మండల స్థాయి యువజనోత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రమేష్ సాహు, జి.శ్రీనివాసరావు, వినోద్‌రాజ్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కంచిలిలో...

కంచిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిర్వహించిన మండల స్థాయి యువజనోత్సవాలలో భాగంగా ఎంఎస్‌పల్లి మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు జగదీష్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, నృత్యప్రదర్శనల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంఎస్‌పల్లి మోడల్‌స్కూల్ విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ పోటీలు నిర్వహించారు. జానపద నృత్యాల పోటీల్లో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింతాడ అర్జునుడు, నవ్యశ్రీ మహంతి, అధ్యాపకులు ప్రియా సుధాకర్, నల్లాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో...

సోంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవితలు, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, అధ్యాపకులు జి.వెంకటరావు, పి.రజనీకుమారి, ఎస్.మోహనరావు, పద్మావతి, ఎ.రామినాయుడు, ప్రసాద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

కవిటి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో వరిపొలాల్లో నిలిచిన నీటిని కాలువల ద్వారా తీసుకొని జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటిని మళ్లించిన తర్వాత ఎకరాకు 15కిలోల చొప్పున పొటాష్, యూరియాను వేయాలన్నారు. వరద ప్రాంతాల్లోని పొలాలను వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించి..రైతులకు సూచనలిస్తారని తెలిపారు. పొడతెగులు నివారణకు ప్రొపికోనాజిల్ రెండు మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

జీపీఎస్ పరికరాలు అమర్చుకోండి

ఆమదాలవలస, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కోసం వినియోగించే వాహనాల లోకేషన్‌ను గుర్తించడానికి జీపీఎస్ పరికరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పరికరాల ద్వారా వాహనాల కదలికలను గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమం కోసం టెక్నీషియన్లు శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వస్తారని తెలిపారు. వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

విధులకు హాజరు కాకుంటే శాశ్వతంగా తొలగింపు

గుజరాతీపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అంగూరు చంద్రరావు అనుమతి లేకుండా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కావడంలేదని... నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందన లేదని, జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల్లో రిపోర్టు చేయకుంటే శాశ్వతంగా విధుల నుంచి తొలగించనున్నట్టు పేర్కొన్నారు. 2002 మే 6వ తేదీ నుంచి చంద్రరావు విధులకు హాజరు కావడం లేదని తెలిపారు.

ఘనంగా ఉక్కుమనిషి జయంతి



సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

ఎచ్చెర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు, పీవోలు బి.శ్రీధర్, సింహాచలం, టి.అసిరినాయుడు, గాయత్రి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో...

సోంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఉన్నత పాఠశాలలలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బీన వంశీ, పట్టణ శ్రీశయన సంఘ అధ్యక్షుడు, రెల్ల నారాయణ, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

కవిటిలో...

కవిటి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతకు పాటుపడిన వ్యక్తి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని కవిటి కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పటేల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభ్‌భాయ్ జయంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేపీ కాలనీలో పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లెక్చరర్లు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, లోకేష్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రత్యేక చట్టం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పని చేసే చోట మహిళల రక్షణ కోసమే పోష్ చట్టం వచ్చిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు చెప్పారు. ఈమేరకు శుక్రవారం స్థానిక న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో వివిధ ఉద్యోగాలు చేస్తున్న మహిళలతో సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో న్యాయవాది ఇందిరాప్రసాద్, లేబర్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సంస్కరణలు

పాత శ్రీకాకుళం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతాంగ పోరాటంలో తొలి సారి అమరులైన కోరన్న, మంగన్నల కారణంగానే అనేక సంస్కరణలకు బీజం పడిందని వక్తలు కొనియాడారు. కోరన్న, మంగన్న వర్ధంతి సందర్భంగా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళంలోని బైపాస్ రోడ్డులోని అమరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ గిరిజన రైతాంగ పోరాటం ఫలితంగా భూసంస్కరణలు, ఐటీడీఏ, జీసీసీ, సంక్షేమ హాస్టళ్ల వంటి సదుపాయాలు అమలులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి భానుమూర్తి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా చట్టం 2006 ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేనట్టయితే చర్యలు తప్పవని ఆహార భద్రత, ప్రమాణాల విభాగం శ్రీకాకుళం ఎఫ్‌ఎస్‌వో జి.శ్రీరాములు హెచ్చరించారు. కేశవరావుపేట, కుశాలపురంలోని డిపార్ట్‌మెంటు స్టోర్స్, స్వీట్ షాపులు, రెస్టారెంట్‌లను శుక్రవారం ఆయన తనిఖీ చేసి కొన్ని ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి ప్రయోగశాలకు పంపించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మతలబుపేటలో రూ.1.30కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి అవినీతితో రాష్ట్రం ఛిన్నాభిన్నమైందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, యువనాయకుడు లోకేష్ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ నూక వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు అంబళ్ల రాంబాబు, నూక ప్రభాకర్, నూక కోటేశ్వరరావు, సనపల రాజు, కిల్లి సిద్ధార్థ, నందివాడ గోవిందరావు, తల్లాడ సురేంద్ర, ఎంపీడీవో ఎం.పావని, జనసేన కన్వీనర్ పేరాడ రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను గౌరవించలేరా?



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, కమిషనర్ రమేష్

ఇచ్ఛాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): 'మున్సిపాలిటీలో గల ప్రజాప్రతినిధులను గౌరవించకూడదని మీకేమైనా ఆదేశాలు వచ్చాయా' అని మున్సిపాల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందిపై మండిపడ్డారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరు అంశాలతో కూడిన అజెండాను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా జీరో అవర్‌లో వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య మాట్లాడుతూ వీధుల్లో వినియోగంలోలేని ఇనుప స్తంభాలను తొలగించాలని కోరారు. రోడ్లపై పశువులు, కోతులు, కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్టాండ్ సమీపంలో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్-2 లాబాల స్వర్ణమణి, కమిషనర్ ఎన్.రమేష్, విద్యుత్ ఏఈ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి




ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బొడ్డేపల్లి సత్యవతి తదితరులు

ఆమదాలవలస, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో పట్టణంలోని గేటు కూడలిలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవింద గోపాల్, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, బొడ్డేపల్లి రవి కుమార్, సాయిరాం, బొత్స రమణ, కృష్ణమూర్తి, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో...

అరసవల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారతదేశ మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీ చేసిన సేవలు ఈ దేశం ఎప్పటికీ మరువలేనివని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల ఆమె విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లపల్లి కృష్ణారావు, పొట్నూరు సీతారాం పాల్గొన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.సత్యన్నారాయణ, దాలినాయుడు, బొత్స వెంకటరమణ, గంగు చంద్రశేఖర్, పాల్గొన్నారు.

తోటాడ సర్పంచ్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ఆమదాలవలస, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడ పంచాయతీ సర్పంచ్‌గా బెండి శ్రీనివాసరావును నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతిసౌజన్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా కొనసాగిన మెట్ట శారద ఇటీవల ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉపసర్పంచ్ బెండి శ్రీనివాసరావును సర్పంచ్‌గా నియమిస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు.

మార్షల్ ఆర్ట్స్‌లో కిరణ్ ప్రతిభ

సోంపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇసుకలపాలెం గ్రామానికి చెందిన పొట్టి కిరణ్‌కుమార్ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపాడు. భోపాల్‌లో ఈ నెల 28న జరిగిన ఇంటర్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో మూడు బంగారు, రెండు, వెండి పతకాలు కైవసం చేసుకున్నాడు. గ్రామస్థులు బైపల్లి బాబూరావు, బైపల్లి ఈశ్వరరావు, బడే తమ్మారావు, డొంక జోగారావు తదితరులు కిరణ్‌ను అభినందించారు.

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణకు ఎంపిక

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణకుగాను 10 మందిని ఎంపిక చేసినట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన జెండా ఊపి డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్‌లో ప్రావీణ్యం సాధించి.. ఉపాధి పొందాలని ఆకాంక్షించారు.

హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల కోసం నిరంతరం పనిచేసేది ఏఐటీయూసీ అని జిల్లా నాయకులు టి.తిరుపతిరావు, చిక్కాల గోవిందరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు గోవిందరావు ఏఐటీయూసీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక కార్మిక చట్టాలు, హక్కులు ఏఐటీయూసీతోనే సాధ్యపడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, స్కూల్ స్వీపర్స్ యూనియన్ కార్యదర్శి టి.పార్వతి, జె.గురుమూర్తి, ఎ.మణి, గురుస్వామి, పార్థసారథి, జి.శ్రీను, పద్మ, కమల, లక్ష్మీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఆమదాలవలస, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్‌ను నియోజకవర్గంలోని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు.

స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌లో ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు శుక్రవారం తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కనీసం పదో తరగతి చదివిన 18-30 ఏళ్ల లోపు గల యువకులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల యువకులు నవంబరు 10వ తేదీలోగా ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో సంబంధిత ధ్రువపత్రాలతో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం ఫోన్ నెంబరు 79891 77887కు సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ క్రీడను మరింత ప్రోత్సహించేందుకు రూ.50 వేల విలువ చేసే పరికరాలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కూన రవికుమార్ క్రీడాకారులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫరీద్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ కుమార్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణి, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, సభ్యులు జి.రాజశేఖర్, ఎ.రాజగోపాల్, ఆనంద్‌కిరణ్, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి జైలు

రణస్థలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నారువ గ్రామానికి చెందిన పిల్ల సూర్యనారాయణ వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన నీలాపు ఆదినారాయణ 2019 అక్టోబరు 7న కులం పేరుతో దూషించి, కుళాయి పైపుతో గాయపరిచినట్లు అప్పట్లో ఎస్‌ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నేరం రుజువు కావడంతో నిందితుడు నీలాపు ఆదినారాయణకు రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.11 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం శ్రీకాకుళంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి ఎం.ఫణికుమార్ తీర్పు వెల్లడించారు. జరిమానా కట్టకపోతే అదనంగా 3 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

గార, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఈశర్ల రఘు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

కోటబొమ్మాళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పెద్దబమ్మిడి గ్రామానికి చెందిన బలివాడ మోహన్(45) నిమ్మాడ-తిలారు రహదారిలోని ఓ గ్రానైట్ పరిశ్రమకు సమీప తోటలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోహన్ ఐదేళ్ల కిందట చిన్నబమ్మిడి జంక్షన్‌లోని వేబ్రిడ్జిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుండగా, ఆయన భార్య హేమలత పెద్దబమ్మిడి గ్రామంలో చిన్న కిరాణిషాపు నడుపుతుండేది. వ్యాపారం సరిగా జరగకపోవడంతో రెండేళ్ల కిందట కుటుంబసభ్యులతో కలిసి శ్రీకాకుళం కొత్తరోడ్డు దగ్గరలో కిరాణిషాపు నడుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే మోహన్ కొన్నాళ్లగా మానసిక రుగ్మతలతో బాధపడుండేవాడు. గతంలో ఓసారి తన ఇంట్లోనే ఉరివేసుకొనే ప్రయత్నం చేయగా కుటుంబసభ్యులు చూసి అడ్డుకున్నారు. ఈ క్రమం మోహన్ గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో నిమ్మాడ జంక్షన్‌లో ఉన్న తన అన్నయ్య తిరుపతి ఇంటికి వచ్చి, వారి కిరాణాషాపులో కాసేపు సేదతీరాడు. అనంతరం జలుమూరు మండలం కొండకామేశ్వరిపేటలో ఉన్న తన చెల్లెలు జ్యోతి దగ్గరకి వెళతానని చెప్పి వెళ్లిపోయాడు. కాగా శుక్రవారం ఉదయం గ్రానైట్ సిబ్బంది బహిర్భుమి కోసం పక్కన ఉన్నతోటలోకి వెళ్లగా అక్కడ ఓ చెట్టుకి ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మోహన్‌కు భార్య హేమలతతోపాటు కుమార్తె ఉంది. హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

కూనజమ్మన్నపేటలో వివాహిత..

సరుబుజ్జిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కూనజమ్మన్నపేట గ్రామానికి చెందిన కూన నీలురాణి (21) శుక్రవారం ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు రాణి గత కొంతకాలం నుంచి గైనిక్ సంబంధిత అనారోగ్యంతో బాధ పడుతుందన్నారు. అనారోగ్యం వల్ల మానసిక క్షోభకు గురై ఎవరూ లేని సమయంలో ఉరి పోసుకున్నట్టు తెలిపారు. చికిత్స కోసం సరుబుజ్జిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు మృతురాలి అమ్మమ్మ ఉప్పాడ వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త రవికుమార్‌తో పాటు రెండేళ్ల కుమార్తె ఉంది.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

జలుమూరు(సారవకోట), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బుడితి గ్రామంలో ఈనెల 28న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, అరతులం బంగారం రికవరీ చేసినట్టు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం బొంతు జంక్షన్‌లో దొంగతనానికి పాల్పడిన చీడిపూడి గ్రామానికి చెందిన రావాడ దేవిశ్రీ ప్రసాద్, జలుమూరు మండలం నామానపేటకు చెందిన తీయల గోపి (కోటి)లను అరెస్టు చేశారు. వీరిద్దరూ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తూ జల్సా చేస్తున్నారు. ఈ క్రమంలో బుడితి గ్రామం పెద్దవీధిలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు నిక్కు చెల్లెమ్మ ఇంటిలో చొరబడి ఆమెను బెదిరించి ముక్కు, చెవికి ఉన్న బంగారం ఆభరణాలు దోచుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థిని మృతిపై ముమ్మర దర్యాప్తు

కొత్తూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న మండంగి కవిత(13) ఇటీవల వైద్యం పొందుతూ విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందిన విషయం తెలిసింది. దీనిపై కొత్తూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆ బాలిక మృతి చెందిందంటూ వచ్చిన ఆరోపణలపై సీతంపేట ఐటీడీఏ పీవో స్వప్నిల్ జగన్నాథ్ దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన బాలికను ఆమె తల్లిదండ్రులు ఈనెల 18న కొత్తూరులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిర వైద్యులకు చూపించారు. సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బాలిక మృతి చెందిందని కేజీహెచ్ సూపరింటెండెంట్ పీవోకు నివేదిక ఇవ్వడంతో దర్యాప్తునకు ఆదేశించారు. కాగా ఈ ప్రైవేట్ వైద్యుడి నిర్లక్ష్యం వల్ల ఇటీవల ఓ వివాహిత మృతి చెందింది. దీనిపై కేసు విచారణ కొనసాగుతుంది. ఈ ఘటన మరువక ముందే విద్యార్థిని మృతి చెందడంతో దర్యాప్తు చేయాలని ఆదేశించారు బాలిక స్వగ్రామం దొంబంగివలస, ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

మట్టిపోసి ఎత్తుచేసి..



కోటబొమ్మాళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలో గల రెడ్డికవీధి, మెయిన్‌రోడ్డును ఆనుకున్న అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ వర్షపునీరు నీల్వ ఉండడంతో శుక్రవారం 'వరదనీటిలో అంగన్‌వాడీ కేంద్రాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. దీంతో కంకర, మట్టి పోయించి ఎత్తు చేయించారు. స్థానిక ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ పనులను పరిశీలించారు.

ఇందిరా గాంధీకి నివాళి


నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు పేడాడ పరమేశ్వర రావు, కోత మధు, పొట్నూరు ఆనంద్, టీబీజీ గుప్త, మాధవ్, రమణ, క్రిష్ణ తదితరులు ఉన్నారు.

టీడీపీకి ఆయన చేసిన సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గౌతు శివాజీ, టీడీపీ నాయకులు

హరిపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీర నాగేశ్వరరావు పార్టీకీ, ప్రజలకు చేసిన సేవలు మరువలేనవని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. మందస మండలం డిమిరియాలో శుక్రవారం నిర్వహించిన నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, పీరుటక్ల విఠల్, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు పాల్గొన్నారు.

బుడుమూరులో అగ్ని ప్రమాదం

- మూడు పూరిళ్లు దగ్ధం.. పాక్షికంగా కాలిన మరో డాబా ఇల్లు
- రూ.8 లక్షల ఆస్తి నష్టం
- కాలిపోయిన మరో రూ.5 లక్షల నగదు
- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు


బాధితులకు సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

లావేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బుడుమూరులో శుక్రవారం ఉదయం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమవ్వగా, మరో డాబా ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. వివరాల్లోకి వెళితే.. ముంత పైడిరాజు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. పైడి రాజు ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ ఆన్‌లో ఉండడంతో మంటలు వ్యాపించాయి. దీంతో పైడిరాజు ఇంటి పక్కనే ఉన్న శ్రీరాములు, గోపి ఇళ్లు కూడా అగ్నికి ఆహుతవ్వగా.. వనం శ్రీనివాసరావుకి చెందిన డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. విషయం తెలుసుకున్న రణస్థలం అగ్ని మాపకం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ముంత శ్రీరాములు తమ కుమార్తె వివాహం కోసం దాచుకున్న రూ.5 లక్షల నగదు కాలిబూడిదవ్వగా, మరో రూ.8 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. ఇల్లు కాలిపోయిన మూడు కుటుంబాల వారు కట్టుబట్టలతో మిగిలారు.

● విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకున్న బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున్న అందజేయగా, తనవంతు మరికొంత మొత్తాన్ని అందజేశారు. తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, కూటమి నాయకులు నల్లి లక్ష్మనాయుడు, పండి గోపాలరావు, పి.శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ సౌజన్యంతో వంట సామగ్రి, దుస్తులు, టార్పలిన్లు అందించారు. సంస్థ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, సుజాత, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● నియోజకవర్గ వైసీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, జడ్పీటీసీ టొంపల సీతారాం బాధిత కుటుంబాలను పరామర్శి, ఒక్కో కుటుంబానికి రైస్ ప్యాకెట్, దుస్తులు అందించారు.

పేదోడికి అండగా ప్రభుత్వం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పేదోడికి అండగా కూటమి ప్రభుత్వ ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో చాకిపల్లి గ్రామానికి చెందిన బొమ్మాళి సుహాషినికి మంజూరైన రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఇటీవల ఆమెకు శస్త్ర చికిత్స జరిగింది. దీంతో ఆమె ఆర్థిక పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలతంపరలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ


ఊరేగింపుగా వస్తున్న రుత్వికులు, భక్తులు

కంచిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలతంపర చంద్రశేఖరాలయంలో శివ పార్వతుల నూతన విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. 14 గ్రామాలకు చెందిన ప్రజల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం మహేంద్రతనయ నుంచి నదీ జలాలను తీసుకువచ్చి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య విద్యార్థి సత్తా

- రూ.33.3లక్షల వార్షిక ప్యాకేజీ



రాఘవన్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ తదితరులు

టెక్కలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ప్రాంగణ ఎంపికలో సత్తా చాటాడు. దిగ్గజ ఐటీ సంస్థ సర్వీస్ నౌ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థి ఎంఏవీకే రాఘవన్ ఎంపికైనట్టు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. రూ.33.3లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించనుందన్నారు. చివరి సెమిస్టర్‌లో రూ.60వేలు వేతనంతో ఆరు నెలలు ఇంటర్నషిప్‌నకు అవకాశం లభించిందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, సీఎస్‌డీ విభాగాధిపతి నరేష్, ప్లేస్‌మెంట్ డీన్ సంతోష్, ప్లేస్‌మెంట్ హెడ్ శ్రీకాంత్ తదితరులు రాఘవన్‌ను అభినందించారు.

ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 చొప్పున్న పరిహారం ఇవ్వాలని పలువురు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నాలుగు రోజులు గడిచినా వరద నీటిలోనే పంటపొలాలు ఉన్నాయన్నారు. ఈ తరుణంలో రైతాంగాన్ని ఆదుకోవల్సిన బాధ్యత ప్రభుత్వానిపై ఉందన్నారు. సీపీఎం నాయకులు బి ఆనందరావు, ఎన్ మోహనరావు ఉన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం

టెక్కలి రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని కోటబొమ్మాళి ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరిరావు అన్నారు. శుక్రవారం నర్సింగపల్లి, మొఖలింగపురం పంచాయతీల్లో పంటలు పోయినా ప్రాంతాన్ని వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నష్టాన్ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. వైసీపీ నాయకులు ఇంట్లో కూర్చొని మాట్లాడడం తప్ప చేసేదేమీ లేదన్నారు. ఏవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పోలాకి షన్ముఖరావు, దారపు రాము, పాపరావు, తిరుపతిరావు, పి.శంకరావు, లచ్చమయ్య, వీపీ విక్కి, తదితరులు ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా బయటకు తీసి వేయాలని ఆమదాలవలస, పెద్దపేటకు చెందిన ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోగల సౌడాం, రేగులపాడు, చౌదరి కొత్తూరు గ్రామాల్లో ఉద్యానశాఖ అధికారి కె. సునీతతో కలిసి సందర్శించి టమాట, మిరప, బెండ, అనప, బంతి తదితర పంటలను పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల వర్షం నీటిలో ఉన్న కూరగాయల పంటలు, పూలతోటలను సంరక్షించేందుకు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేగులపాడు ఎంపీటీసీ పట్ట సింహాచలం, కురుడు సర్పంచ్ కోత చిన్నారావు, గట్లపాడు సర్పంచ్ తవిటయ్య, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసర సరుకులు

పోలాకి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత సముద్రంలో వేటకు వెళ్లని మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర సరకులు అందిస్తుందని మండల ప్రత్యేకాధికారి వెంకటమధు తెలిపారు. శుక్రవారం ఆయన గుల్లవానిపేట, గుప్పెడుపేట తదితర తీర ప్రాంతగ్రామాల్లో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ బాధిత మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం, ఇతర బాధితులకు 25 కిలోలు బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార అందించాలని రేషన్‌డీలర్లకు ఆదేశాలు వచ్చాయన్నారు. పునరావస కేంద్రాలకు వెళ్లిన బాధితులకు ఆర్థిక సాయం అందచేస్తారన్నారు. తహసీల్దర్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవి కుమార్, డిప్యూటీ ఎంపీడీవో బి.పద్మావతి తదితరుల పాల్గొన్నారు.

రామారావు సేవలు మరువలేనివి


రామారావు దంపతుల్ని సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు అంపోలు రామారావు సేవలు మరువలేనివని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ఠ సేవలు అందించి విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్న రామారావు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని ఆమె కొనియాడారు. అధ్యాపక వృత్తికే ఆయన వన్నె తెచ్చారన్నారు. అనంతరం రామారావుతో పాటు భార్య కృష్ణవేణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంపోలు త్రినాథరావు, కుంతెమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, లూకాపాల్ తదితరులు పాల్గొన్నారు. తనకు అభిమానించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలన


రాంపురంలో పంటను పరిశీలిస్తున్న దృశ్యం

నందిగాం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న పంటల్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, అనకాపల్లి అసోసియేషన్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, రాగోలు, ఆమదాలవలస ఏఆర్ఎస్‌లు కె.మధుకుమార్, జి.చిట్టిబాబు, పి.ఉదయభాను, జి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ బృందం రాంపురం, దిమిలాడ గ్రామాలను సందర్శించి దెబ్బతిన్న పంటల్ని పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు కె.త్రినాథ స్వామి, టెక్కలి ఏడీఏ కె.జగన్మోహనరావు, ఏవో పి.శ్రీకాంత్‌వర్మ ఉన్నారు.

మబగాంలో వైద్య శిబిరం

పోలాకి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మబగాంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలువురు జ్వరాలు, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని పోలాకి పీహెచ్‌సీకి సమచారం వచ్చింది. ఈ మేరకు వైద్యాధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించి 35 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు రక్తపూతలు, మధుమేహం వంటి పరీక్షలు జరిపారు. ఉన్నత వైద్యం కోసం ఉన్నత వైద్యశాలకు సిఫారసు చేశారు. పోలాకి ఆరోగ్యకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తేనే జాతీయస్థాయిలో గుర్తింపు


తప్పెట గుళ్ల ప్రదర్శన పోటీలో యువకులు

జలుమూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లోను రాణిస్తేనే జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సారిక అన్నారు. స్వామి వివేకనంద జయంతి వేడుకలు పురస్కరించుకొని వచ్చేఏడాది జనవరి 12న న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజనోత్సవం సందర్భంగా శుక్రవారం జూనియర్ కళాశాలలో శుక్రవారం మండలస్థాయి ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూలు, విజ్ఞానదుర్గా జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమైక్యతే మన విధానం



టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి మన లక్ష్యమని ప్రణవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నినాదించారు. మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరిం చుకొని ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ సమైఖ్యత, మత సామరస్యాలకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్, ఎన్ఎస్ఎస్ పీవో రామపాత్రుని రామరావు, భోగస్వామి, కుమారి, వెంకట్రావు, రుక్మాంధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ సతీష్, గొల్ల, లూక్‌పాల్, ధర్మారావు, రెయ్యమ్మ తదితరులు ఉన్నారు.

● సంతబొమ్మాళి: భావనపాడులో మెరైన్ పోలీసుల అధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో జాతీయ సమైక్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. భావనపాడు మెరైన్ సిఐ రాము, ఎస్ఐశ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

● మెళియాపుట్టి: ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం యువజనోత్సవాలు సందర్భంగా పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు వైకుంఠరావు, తదితరులు ఉన్నారు.

● పాతపట్నం: యువతే దేశానికి నిజమైన జాతీయ సంపదని ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ టి.హేమసుందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువజనోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఏపీ మోడల్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

● నందిగాం: పెద్దతామరాపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. మాజీ ఉపప్రధాని, హోంమంత్రి స్వర్గీయ వల్లభాయిపటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పలాస: సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు సందర్భంగా శక్ర వారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏక్తాదివస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.మధు, ఉమెన్ ఎస్‌పవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ కె.గిరిజ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

● జలుమూరు: ర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు భావి భారత పౌరులుగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హెచ్ఎం ఇప్పిలి మాధవరావు అన్నారు. స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పటేల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు మెండ రామారావు, లక్ష్మణరావు, ప్రసాదరావు, రమేష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


పాతపట్నం: విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పోక్సో కేసు నమోదు

సంతబొమ్మాళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమపేరుతో గర్భవతిని చేసిన అదే గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు నౌపడ ఎస్ఐ జి.నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. శుక్రవారం పత్రికల్లో వచ్చిన కథనాలపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హారిక

మెళియాపుట్టి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జాడుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎన్.హారిక ఎంపికైనట్టు కోచ్ మీనా బిస్వాల్ తెలిపారు. నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా హారికను పాఠశాల హెచ్ఎం ఎస్.చంద్రరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అవగాహన పెంచుకోవాలి

పలాస, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావు కోరారు. శుక్రవారం వర్షాలకు పూడుకుపోయిన ప్రధాన కాలువల్లో మట్టిని తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ వర్షాలకు మొత్తం కాలువలన్నీ చెత్తతో నిండిపోయిందని, దీన్ని తొలగించి మురుగునీరు సులభంగా వెళ్లడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రతిపక్షాల విమర్శలు సరికాదు

కొత్తూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ విపత్కర్ పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండేలా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్ష నేత అని చెప్పుకుంటున్న జగన్‌రెడ్డి చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు, గాలులకు ప్రజలు భయభ్రాంతులు గురుకాకుండా రియల్ టైం గవర్నన్స్(ఆర్‌టీజీఎస్) ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేశారన్నారు. నష్ట తీవ్రతను తగ్గించిన ప్రభుత్వంపై జగన్‌రెడ్డి చేస్తున్న విమర్శలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని హితువు పలికారు.

ఆర్‌హెచ్ పురంలో సత్సంగం

సంతబొమ్మాళి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని ఆర్‌హెచ్ పురంలో సత్సంగం శుక్రవారం నిర్వహించారు. లైదాం చెందిన వైవజ్ఞ యాలాల శ్రీనివాసరావు రామాయణం గురించి కార్తీకమాసం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గేదెలు స్వాధీనం

లావేరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నుంచి విశాఖ వైపు వ్యాన్‌తో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది గేదెలను శుక్రవారం జాతీయ రహదారిపై బుడుమూరు వద్ద లావేరు పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నందిగాం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హరిదాసుపురంలో శుక్రవారం పేకాట శిబిరంపై నిర్వహించిన దాడిలో ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. స్థానిక ఆర్ఎస్‌కే సమీపంలో పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారంపై సిబ్బందితో దాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకొని రూ.4,750 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

బస్సు ప్రమాదంపై కేసు నమోదు

ఆమదాలవలస, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జొన్నవలస-మునగవలస మధ్య అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో గురువారం రాత్రి జరిగిన బస్సు బోల్తా ఘటనపై శు క్రవారం కేసు నమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఒడిశా రా ష్ట్రం పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీకి చెందిన బస్సు విద్యార్థులతో పాటు డ్రైవర్, క్లీనర్ మరో వ్యక్తితో ఆమదాలవలస వైపు వచ్చిందన్నారు. మునగవలస-జొన్నవలస మధ్య మలుపు వద్ద అతి వేగంగా వస్తున్న బస్సును డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడిందని ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనలో గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

విగ్రహాల ధ్వంసం కేసులో వ్యక్తికి జైలు శిక్ష

జి.సిగడాం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డీఆర్‌వలస గ్రామ శివాలయం పక్కన ఉన్న నవగ్రహాల ఆలయంలో గల విగ్రహాల ధ్వంసం కేసులో అదే గ్రామానికి చెందిన వేమల రామకృష్ణకు మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని లేదా రూ.మూడు వేల జరిమానాను చెల్లించాలని శుక్రవారం పొందూరు మెజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చినట్టు జి.సిగడాం పోలీసులు విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది జూలై 11న ఆలయంలో నవగ్రహాల విగ్రహాలు ధ్వంసమైనట్టు కుమరాపు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో న్యాయాధికారి శిక్ష విధించినట్టు పోలీసులు తెలిపారు.

మెస్‌చార్జీలు పెంచాలి

పలాస, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థుల చెల్లించే మెస్ చార్జీలు పెంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సూదికొండ పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాటాడారు. రెండున్నరేళ్లుగా మెస్‌చార్జీలు ప్రభుత్వం పెంచలేదని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వీటిని పెంచాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. హైస్కూల్ విద్యార్థులకు రూ.1400, ఇంటర్ విద్యార్థులకు రూ.1600 చొప్పున మెస్‌చార్జిలు ఇస్తున్నారని, దీన్ని కనీసం రూ.3వేలకు పెంచాలని కోరారు. సమావేశంలో విద్యార్థిసంఘ నాయకులు విజయ్, ధనుంజయ్, భరత్, కుమార్ పాల్గొన్నారు.

